ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 269 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 30 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole



నేడే నెలలో 12 రోజులు బ్యాంకులు బంద్

ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): ఇంకొన్ని రోజుల్లో మే నెల రాబోతుంది. ఈ నెలలో మీకు ఏదైనా బ్యాంకు పనులు ఉన్నాయా. ఉంటే మాత్రం ఈ సెలవుల గురించి తప్పక తెలుసుకోండి. ఈ క్రమంలో వచ్చే నెలలో ఎన్ని రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఎన్ని రోజులు పనిచేయనున్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం మే 2025లో 12 రోజులు బ్యాంకులు బంద్ అవుతాయి. ఏప్రిల్ నెల ఒక రోజులో ముగియనుంది. ఇదే సమయంలో బ్యాంకులు కూడా ఫుల్ బిజీగా ఉంటాయి. ఈ క్రమంలో మీరు వచ్చే నెలలో ఏదైనా బ్యాంకు పనుల కోసం చూస్తున్నారా. అయితే ఓసారి ఈ సెలవుల గురించి తెలుసుకుని ప్లాన్ చేసుకోండి మరి. ఎందుకంటే బ్యాంకు సెలవుల గురించి తెలుసుకోకుండా వెళితే మీరు ఇబ్బందులు పడే ఛాన్సుంది. మే 2025లో మొత్తం 12నెలలో రోజులు బ్యాంకులు బంద్ ఉంటాయి. ఈ సెలవులు వివిధ రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి. కాబట్టి మే నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం ఎప్పుడు బ్యాంకులు బంద్ ఉంటాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

పూర్తి లిస్ట్ ఇదే

మే 2025లో బ్యాంకు సెలవులు పూర్తి జాబితా

01 మే (గురువారం) - బెలాపూర్, బెంగళూరు, చెన్నై, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అసోం, ఇంఫాల్, కోచి, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పనాజీ, పాట్నా, తిరువనంతపురం ప్రాంతాల్లో సెలవు.

04 మే (ఆదివారం) - వారాంతపు సెలవు కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్.

09 మే (శుక్రవారం) - రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా పశ్చిమ బెంగాల్లో మాత్రమే సెలవు.

10 మే (శనివారం) - నెలలో రెండో శనివారం కారణంగా బ్యాంకులు మూసివేయబడతాయి.

11 మే (ఆదివారం) - వారాంతపు సెలవు కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు హాలిడే.

12 మే (సోమవారం) - బుద్ధ పూర్ణిమ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మిజోరం, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో సెలవు.

16 మే (శుక్రవారం) - వార్షిక దినోత్సవం నేపథ్యంలో సిక్కింలో హాలిడే.

18 మే (ఆదివారం) - ఆదివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్.

24 మే (శనివారం) - నెలలో నాల్గో శనివారం కారణంగా బ్యాంకులు మూసివేయబడతాయి.

25 మే 2 (ఆదివారం) - వారాంతపు సెలవు.

26 మే (సోమవారం) - కవి కాజీ నజ్రుల్ ఇస్లాం జన్మదినోత్సవం నేపథ్యంలో త్రిపురలో బ్యాంకులకు సెలవు.

29 మే (గురువారం) - మహారాణా ప్రతాప్ జయంతి జన్మదినోత్సవం సందర్భంగా సిమ్లాలో బ్యాంకులకు హాలిడే.

ఆన్‌లైన్ సేవలు మాత్రం..

అన్ని రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవులు ఒకేలా ఉండవు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం పలు ప్రాంతాలకు స్థానిక పండగుల సెలవులు మారుతుంటాయి. బ్యాంకులు మూసివేయబడినప్పటికీ, కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సెలవు రోజుల్లో కూడా, ప్రజలు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సహా తమ పనులన్నింటినీ ఈజీగా పూర్తి చేసుకోవచ్చు. బ్యాంకు సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అందువల్ల, సెలవు రోజుల్లో కూడా మీరు ఇంట్లో కూర్చొని అనేక బ్యాంకింగ్ పనులను పూర్తి చేసుకోవచ్చు.



పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

పుల్వామా ఘటన తర్వాత తొలిసారి

ప్రధాని మోదీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నేడు భేటీ అయ్యింది.

దిల్లీ, ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఇక, ఈరోజు సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

సూపర్ క్యాబినెట్..

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది. అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తో

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి..

గోడకూలి ఏడుగురు భక్తులు మృతి

సింహాచలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రూ.300 టికెట్ క్యూలైన్ పై గోడకూలింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు.

సింహాచలం, ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందినవారు.

మృతుల వివరాలు..

పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా .
ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం
కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా .
గుజ్జరి మహాలక్ష్మి (65), హెబీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం .
పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం .
పిళ్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం .
పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం .

కర్రెగుట్టలపై జాతీయ పతాకాన్ని ఎగురవేసిన భద్రతా బలగాలు

తెలంగాణ-ఛత్తీస్ గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 వేల అడుగుల ఎత్తులోని కర్రెగుట్టల్లో కీలకమైన మావోయిస్టు నేతల ను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన భారీ ఆపరేషన్ బుధవారం 9వ రోజుకు చేరుకుంది.

చర్ల, ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ-ఛత్తీస్ గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 వేల అడుగుల ఎత్తులోని కర్రెగుట్టల్లో కీలకమైన మావోయిస్టు నేతలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన భారీ ఆపరేషన్ బుధవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్లో భాగంగా కర్రెగుట్టలో కొంత భాగాన్ని భద్రతాబలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. శిఖరం వరకు చేరుకున్న బలగాలు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ కనిపించాయి. సీఆర్పీఎఫ్ నేతృత్వంలో ఛత్తీస్ గడక్కు చెందిన డీఆర్, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్గఢ్లోని పూజారికాంకేరు, నంబి, గల్గం, నడిపల్లి ప్రధాన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 24న జరిగిన ఎదురు కాల్పుల్లో పీఎల్జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) మొదటి బెటాలియన్కు చెందిన ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. కర్రెగుట్ట ఆపరేషన్ జరుగుతున్న క్రమంలోనే శాంతి చర్చలు జరపాలని కోరుతూ మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే కర్రెగుట్టల ప్రాంతాన్ని అష్టదిగ్బంధనం చేసిన బలగాలు ఆ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన 150కు పైగా ఐఈడీలను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు.

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?:కేసీఆర్ పై సీఎం రేవంత్ ఫైర్

ఇటీవల ఎల్కతుర్తిలో భారాస సభలో తెలంగాణకు కాంగ్రెస్సే విలన్ అంటూ మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

హైదరాబాద్, ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. "బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ.. ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలుతీసుకొని వసతులు అనుభవిస్తున్నారు. అన్ని వసతులు అనుభవిస్తూ ఫాంహౌస్లో ఎందుకు ఉన్నారు? అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకి మమ్మల్ని ప్రశ్నించే

నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెల్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్ లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. రైతుబంధు ఆగిందా? రైతు రుణమాఫీ ఆగిందా? ప్రజా పాలన ఆగిందా? హైదరాబాద్ విస్తరణకు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది" అన్నారు.

72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వండి..

సింహాచలం ఘటనపై సీఎం చంద్రబాబు

సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

అమరావతి, ఏప్రిల్ 30, (రిపబ్లిక్ న్యూస్): సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1777 :** జర్మనీకి చెందిన సుప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు కార్ల్ ఫ్రెడెరిక్ గాస్ జననం (మ. 1855).
- **1870 :** భారతీయ సినిమా పితామహుడు, సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే-రచయిత దాదాసాహెబ్ ఫాల్కే జననం (మ. 1944) (చిత్రంలో)
- **1945 :** జర్మనీలో నాజీ పార్టీ వ్యవస్థాపకుడు హిట్లర్ మరణం (జ. 1889).
- **1946 :** మద్రాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు పదవి చేపట్టాడు.
- **1910 :** మహాకవి శ్రీరంగం శ్రీనివాస రావు (శ్రీశ్రీ) జననం (మ. 1983).
- **1968 :** ప్రముఖ మత్తుమందు వైద్యుడు, రాజకీయ నాయకుడు దాడిచిలుక వీర గౌరీశంకర రావు జననం.
- **1987 :** భారత దేశ క్రికెట్ క్రీడాకారుడు రోహిత్ శర్మ జననం.

కార్ల్ ఫ్రెడెరిక్ గాస్

దాదాసాహెబ్ ఫాల్కే

హిట్లర్

టంగుటూరి ప్రకాశం పంతులు

శ్రీరంగం శ్రీనివాస రావు (శ్రీశ్రీ)

రోహిత్ శర్మ

పబ్లిసిటీ గురించి అసలు పట్టించుకోను:వెంకటేశ్

తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఒక సలహా ఇచ్చారని ఇప్పటికీ అదే పాటిస్తున్నట్లు వెంకటేశ్ చెప్పారు.

రజనీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పారు. అలాగే తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఓ సలహా ఇచ్చారని అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ సలహానే పాటిస్తున్నానన్నారు. "రజనీకాంత్కు, నాకు ఇద్దరికీ ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా నాన్నతో కలిసి ఆయన వర్క్ చేశారు. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ సమయంలో బ్యానర్లు కట్టారా? పోస్టర్లలో మన ముఖం బాగా కనిపిస్తుందా? మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్లో మన ఫొటో వేశారా? ఇలాంటి వాటి గురించి ఆలోచించొద్దన్నారు. మన పని మనం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ అదే సలహాను పాటిస్తున్నాను. పబ్లిసిటీ గురించి పట్టించుకోను. దేని గురించి ఎక్కువగా ఆలోచించను" అని వెంకటేశ్ చెప్పారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో వెంకటేశ్ తనకు అరుణాచలం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రమణ మహర్షిని ఆరాధిస్తానని తెలిపారు. చిన్నప్పటినుంచి ఆధ్యాత్మిక భావాలు ఎక్కువేనని చెప్పారు. దేవుడంటే భయం ఎక్కువని.. భగవంతుడికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివినట్లు తెలిపారు. 'ఘర్షణ' సమయంలో తాను ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని దేవుడి దయతోనే ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడినట్లు చెప్పారు.

నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది:భార్యపై ప్రశంసలు కురిపించిన అజిత్

పద్మభూషణ్ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు అజిత్. ఈసందర్భంగా తన భార్యపై ప్రశంసలు కురిపించారు.

తాజాగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్. ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది తనకు ప్రేరణగా నిలుస్తుందని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సందర్భంగా తన భార్య షాలినిపై ప్రశంసలు కురిపించారు. ఆమె ఎన్నో త్యాగాలు చేసినట్లు చెప్పారు. "నేను ఇప్పటికీ సామాన్యుడిలానే ఆలోచిస్తాను. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. ఈ స్థాయిలో ఉండడానికి నా భార్య షాలినినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. ప్రతి పనిలోనూ నాకు తోడుంటుంది. ఒక్కోసారి నేను సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె అండగా నిలిచింది. నన్ను ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నిటికీ దూరమైంది. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారందరికీ కూడా నేను ఈసందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాను" అని చెప్పారు. "నేను కేవలం నటుడిని. నటన నాకు జీతాన్నిచ్చే ఓ ఉద్యోగంగా భావిస్తాను. సూపర్స్టార్ అని పిలిపించుకోవడం నచ్చదు. ఎందుకంటే అలాంటి ట్యాగ్స్ పై నాకు నమ్మకం లేదు. 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. జీవితమంతా అభిమానులను అలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతవరకూ సాదాసీదాగా ఉంటాను. అతిగా ఆలోచించను. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టు అంగీకరించను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను" అని అజిత్ తెలిపారు.



లైక్స్ కోసం ఏదైనా రాసేస్తారు..: మౌనీరాయ్

ఇటీవల తన కొత్త సినిమా ప్రచారంలో భాగంగా జరిగిన ఈవెంట్లో నటి మౌనీరాయ్ న్యూలుక్లో కనిపించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె అందం కోసం శస్త్రచికిత్స చేయించుకున్నారని ప్రచారం జరిగింది. ఈ లుక్లో కొన్ని ఏఐ వీడియోలను కూడా క్రియేట్ చేసి షేర్ చేశారు. తాజాగా దీనిపై మౌనీరాయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటివి ప్రచారం చేసేవారిని చూస్తే జాలి వేస్తుందన్నారు. "నా లుక్పై వచ్చిన ఎన్నో ఏఐ వీడియోలు చూశాను. అవి భయంకరంగా ఉన్నాయి. నా ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించారు. ఆ వీడియోలు చూడడానికి కూడా చాలా అసహ్యంగా ఉన్నాయి. ఇలాంటివి క్రియేట్ చేయడం వల్ల వారికి ఎలాంటి ఆనందం వస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. వారి లక్ష్యం ఏమిటనేది తెలియదు. ఇలాంటివారు ఎవరిలోనూ మంచిని చూడలేరు. నేను సోషల్ మీడియాను ఉపయోగించడం ప్రారంభించిన తొలినాళ్లలో నెగెటివ్ కామెంట్స్ చేసేవారి ప్రొఫైల్ ఓపెన్ చేసి వారి గురించి తెలుసుకొని బ్లాక్ చేసేదాన్ని. ఇప్పుడు ఇలాంటి వారిని చూస్తే జాలి వేస్తోంది. వారికి సరైన బుద్ధిని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తాను. వారి లైక్ల కోసం సెలబ్రిటీలపై చెత్త సమాచారమంతా రాస్తారు" అని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మౌనీరాయ్ 'ది భూత్నీ' ప్రచారంలో బిజీగా ఉన్నారు. సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సిద్ధాంత్ సర్దేవ్ దర్శకత్వం వహించారు. మే1న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తనకు చాలా ప్రత్యేకమని మౌనీ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులోని స్టంట్స్ కోసం డూప్స్ ఉపయోగించలేదని.. తానే స్వయంగా చేశానని చెప్పారు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

నేడు రికార్డుల బాహుబలి.. రోహిట్ శర్మ బర్త్‌డే...

నేడు హిట్మ్యాన్ పుట్టినరోజు సందర్భంగా రోహిత్ అభిమానులు అనితర సాధ్యమైన అతడి రికార్డులన్నింటినీ ఓసారి నెమరువేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఫేవరేట్ బ్యాటర్కు బర్త్డే విషెస్ చెబుతున్నారు.

ఈ రోజు టీమ్ ఇండియా కెప్టెన్, హిట్మ్యాన్ రోహిత్ శర్మ బర్త్. అతడు 37 సంవత్సరాలు పూర్తి చేసుకొని 38 లోకి అడుగుపెడుతున్నాడు. కొన్ని ఏళ్లుగా రోహిత్ శర్మ భారత జట్టుకు తన సేవలు అందిస్తున్నాడు. ఈక్రమంలో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈనేపథ్యంలో కేవలం హిట్ మ్యాన్కే సాధ్యమైన కొన్ని రికార్డుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

వన్డేల్లో రారాజు రోహిత్ శర్మకు వన్డే క్రికెట్లో అద్భుతమైన రికార్డులున్నాయి. సెంచరీ చేయడమే గగనమైపోతున్న ఈ రోజుల్లో హిట్మ్యాన్కు ఏకంగా ఈ ఫార్మాట్లో మూడు డబుల్ సెంచరీలున్నాయి. రోహిత్ శర్మకు వన్డే ఫార్మాట్లో 264 పరుగులు అత్యధిక వ్యక్తిగత స్కోరు. వన్డేల్లో ఒక టీమ్ కొట్టే స్కోర్ ఇది. టీమ్ అంతా కొట్టే స్కోర్లు రోహిత్ శర్మ ఒక్కడే బాది చూపించాడు. 2014 నవంబరు 13న కోల్కతాలోని ఈడెన్ గార్డెన్స్లో, రోహిత్ శర్మ శ్రీలంకపై 264 పరుగులు చేసి వన్డే క్రికెట్లో కొత్త బెంచ్మార్క్ను నెలకొల్పాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇంతవరకు ఈ రికార్డు బ్రేక్ కాలేదు. ఈ ఇన్నింగ్స్లో రోహిత్ శర్మ 33 ఫోర్లు, 9 సిక్స్ లు బాదాడు.

వరల్డ్ కప్ శతకాల వర్షం.. 019 వన్డే వరల్డ్ కప్లో రోహిత్ శర్మ పేరిట అద్భుతమైన రికార్డు ఉంది. తాను ఆడిన తొమ్మిది ఇన్నింగ్స్ ల్లో ఏకంగా 5 సెంచరీలు నమోదు చేశాడు. ఇప్పటివరకు ఒక వరల్డ్కప్లో ఏ బ్యాటర్ కూడా ఇన్ని సెంచరీలు చేయలేదు.

పొట్టి ఫార్మాట్లోనూ గట్టోడే! కేవలం వన్డేల్లోనే కాదు.. పొట్టి ఫార్మాట్ అయిన టీ20ల్లోనూ రోహిత్ శర్మకు ఘనమైన రికార్డుంది. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఈ ఫార్మాట్లో 5 సెంచరీలు చేశాడు. ఇందులో ఓ సెంచరీని కేవలం 35 బంతుల్లోనే పూర్తి చేశాడు.

సిక్సుల మోతే.. ఆడేది అయిదు రోజుల టెస్ట్మ్యాచ్ అయినా, 50 ఓవర్ల వన్డే అయినా, 20 ఓవర్ల పొట్టి క్రికెట్ అయినా.. ఫార్మాట్ ఏదైనా రోహిత్ శర్మ ఫార్ములా ఒక్కటే..... సిక్సుల మోత మోగించడం. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఏకంగా 637 సిక్స్ లు బాది, ఈ జాబితాలో ప్రథమస్థానంలో ఉన్నాడు. ఈ లిస్టులో యూనివర్సల్ బాస్ క్రిస్టోల్ 553 సిక్సోతో రెండోస్థానంలో ఉన్నాడు. అలాగే వరల్డ్ కప్పు, ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి ఐసీసీ వన్డే టోర్నమెంట్లలోనూ రోహిత్ శర్మ 68 సిక్సులు బాదాడు. ఈ జాబితాలోనూ హిట్మ్యానే టాప్ ప్లేస్లో ఉన్నాడు. అలాగే ఆస్ట్రేలియా మీద 132 సిక్సు బాదాడు. ఒక ప్రత్యర్థి జట్టుపై రోహిత్ తప్ప ఏ బ్యాటర్ కూడా ఇన్ని సిక్స్ లు కొట్టలేదు. కేవలం సిక్సులే కాదు.. ఫోర్లలోనూ రోహిత్ శర్మకు ఒక రికార్డు ఉంది. తన 264 పరుగుల ఇన్నింగ్స్లో 33 ఫోర్లు బాదాడు కదా! ఒక వన్డే ఇన్నింగ్స్లో ఇన్ని ఫోర్లు కొట్టిన బ్యాటర్ ఇంకెవరూ లేరు. మొత్తానికి మన హిట్ మ్యాన్కు మంచి ఘనమైన రికార్డులే ఉన్నాయి. నేడు అతడి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వీటన్నింటినీ ఓసారి నెమరువేసుకుంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఫేవరేట్ బ్యాటర్కు బర్త్డే విషెస్ చెబుతున్నారు.

ఆరోగ్యం

ఇంత ప్రమాదమా! ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయను తింటే ఏమవుతుందో తెలుసా?

చాలా మంది పుచ్చకాయను కట్ చేసి తిన్న తర్వాత కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తింటారు. అయితే, ఇలా తినడం వల్ల ఏమవుతుందో తెలిస్తే మీరు ఆ పని చేయరు.

వేసవి కాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో పుచ్చకాయను ఎక్కువగా తింటారు. పుచ్చకాయల దాదాపు 90 శాతం నీటితో నిండి ఉంటుంది. ఇది వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. ఇప్పటికే మార్కెట్లో పుచ్చకాయలు విరివిగా లభిస్తున్నాయి.. పుచ్చకాయలో విటమిన్ ఏ,బి కాంప్లెక్స్ సి పొటాషియం మీ చర్మానికి పోషణ అందిస్తాయి. వీటితో పాటు.. పుచ్చకాయలోని లైకోపీన్, బీటా - కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎండాకాలంలో డీహైడ్రేట్ అవ్వకుండా పుచ్చకాయ కాపాడుతుంది. అయితే, చాలా మంది పుచ్చకాయను కట్ చేసి తిన్న తర్వాత కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తింటారు. అయితే, ఇలా తినడం వల్ల ఏమవుతుందో తెలిస్తే మీరు ఆ పని చేయరు. ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తినడం వల్ల కలిగే ప్రమాదాలేంటో తెలుసుకుందాం.

ఫ్రిజ్‌లో పెట్టి తింటే డేంజర్



చాలా మంది పుచ్చకాయను తెచ్చుకున్న తర్వాత కట్ చేసి కొంత భాగం తింటారు. మరి కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో పెడతారు. ఆ తర్వాత తినాలనిపించినప్పుడు మిగిలిన భాగాన్ని తింటారు. మీకు కూడా ఈ అలవాటు ఉంటే వెంటనే మానేయండి. ఇలాంటి పుచ్చకాయ తినడానికి రుచిగా, చల్లగా ఉంటుంది. అయితే, ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుందంటున్నారు డాక్టర్ మీనాక్షి జైన్. ఆమె ప్రకారం ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయలో పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాకుండా ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కోనే ప్రమాదముంది.

పోషకాలు నశిస్తాయి

పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచితే లైకోపీన్, సిట్రులిన్, విటమిన్ ఎ, విటమిన్ సి పరిమాణం తగ్గుతుందని డాక్టర్ మీనాక్షి జైన్ అంటున్నారు. ఇది మాత్రమే కాదు, కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల అది ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశాలు పెరుగుతాయి. కట్ చేసిన పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల అందులో ఉండే చక్కెర పరిమాణం పెరుగుతుంది. దీంతో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం పెరుగుతుంది.

వచ్చే సమస్యలు



- పుచ్చకాయను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల దాని పోషక విలువలు తగ్గుతాయి
- చల్లని పుచ్చకాయ తినడం వల్ల దగ్గు, జలుబు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
- చల్లని పుచ్చకాయన తినడం వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ఛాన్స్ ఉంది
- చల్లని పుచ్చకాయలో ఉండే బ్యాక్టీరియా పేగుకు హాని కలిగిస్తుంది
- కడుపు సంబంధిత వ్యాధులు, జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

గది ఉష్ణోగ్రత బెస్ట్

కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్‌లో పెట్టే బదులు దాన్ని గది ఉష్ణోగ్రత ఉంచాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత కొన్ని గంటలకే తింటే సరిపోతుందంటున్నారు. అంతేకాకుండా కట్ చేసిన పుచ్చకాయను రంధ్రాలు ఉన్న మూతతో కవర్ చేయాలంటున్నారు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచాల్సిన అవసరం లేదు ఎందుకంటే దాని బయటి పొర చాలా మందపాటి తొక్కను కలిగి ఉంటుంది, దీని కారణంగా అది త్వరగా చెడిపోదు.

రాత్రి పూట తినకండి

పుచ్చకాయ చల్లని స్వభావం కలిగి ఉంటుంది. అయితే, రాత్రి పూట తినకూడదంటున్నారు నిపుణులు. రాత్రి పూట జీర్ణక్రియ మందగిస్తుంది. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో, కడుపులో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. రాత్రి పూట తినడం వల్ల తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో మీ నిద్ర పాడయ్యే అవకాశం ఉంది.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.